

# దుర్మార్గమైన పార్టీ .. కాంగ్రెస్

## నాటి నుంచి నేటి దాకా.. తెలంగాణకు ఆ పార్టీ శత్రువే

- నమ్మి పొత్తుపెట్టుకుంటే.. 15 ఏండ్లు ఏడిపించిండ్రు
- వందల మంది విద్యార్థులను పొట్టన పెట్టుకున్నరు
- నిజాంసాగర్‌ను ఎండబెట్టి.. రైతులకు నరకం చూపించిండ్రు
- అప్పులు కట్టలేదని.. తలుపులు ఊడపీక్కపోయిన చరిత్ర వాళ్లది
- దుర్మార్గపు కాంగ్రెస్ పార్టీని మట్టికరిపించాలి
- బీజేపీ మతపిచ్చితోని మంటలు పెట్టి.. ప్రజలను విడగొట్టే పనులు చేస్తున్నది



- తెలంగాణ వచ్చినంక నిజాంసాగర్‌కు పూర్వవైభవం తీసుకువచ్చినం
- బీఆర్ఎస్ ముమ్మాటికి సెక్యులర్ పార్టీయే
- రాబోయే రోజుల్లో ప్రాంతీయ పార్టీలదే హవా
- కేంద్రంలో తడాఖా చూపెడుదాం
- బోధన్, నిజామాబాద్ అర్బన్ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్



బోధన్ ప్రజా ఆశీర్వాద సభలో అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్, అభ్యర్థి షకీల్





**తెలంగాణ ఇస్తారని పొరపాటున నమ్మి కాంగ్రెస్ పార్టీతో పొత్తుపెట్టుకుంటే 15 ఏండ్లు ఏడిపించి, వందల మంది విద్యార్థులను పొట్టన పెట్టుకున్న దుర్మార్గమైన పార్టీ అది. నాటి నుంచి నేటి దాకా తెలంగాణకు కాంగ్రెస్ పార్టీ శత్రువే.** అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. బుధవారం బోధన్ నియోజకవర్గం అభ్యర్థి మహ్మద్ షకీల్ అమీర్, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తాలకు మద్దతుగా నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ హయాంలో సింగూరు ప్రాజెక్టును కట్టి.. నిజాంసాగర్‌ను ఎండబెట్టి రెండు ప్రాజెక్టుల కింద ఉన్న రైతులకు నరకం చూపించిండ్రు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో పదేండ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేస్తుందో మీరు చూస్తున్నారు. నిజాంసాగర్‌కు పూర్వవైభవం తీసుకువచ్చి.. సింగూరును నింపి.. కాల్వలను బాగుచేసి, చెక్‌డ్యాములు కట్టి.. రైతుల ముఖాలు తెల్లబడేలా చేసినం. దేశంలోనే బీడీ కార్మికులకు పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం మనదే. 50 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో రైతులు అప్పులు కట్టకుంటే తలుపులు ఊడపీక్కపోయారు.. కానీ రైతుబంధు గురించి ఆలోచించలేదు. మన దగ్గర ఉన్న పథకాలు పక్కనే ఉన్న మహారాష్ట్ర, కర్ణాటకలో ఉన్నాయా.? వాళ్లు మన రాష్ట్రంలో కలుపమని అడుగుతున్నరు. మళ్లీ కాంగ్రెస్ రాజ్యం వస్తే.. కరెంటు కాట కలుస్తది.. రైతుబంధు, రైతు బీమాకు రాంరాం.. చెప్తరు. ధరణి బంగాళాఖాతానికి.. రైతులు అరేబియా సముద్రానికి అంతేకదా.. కాంగ్రెస్ పార్టీ అంటేనే బ్రోకర్లు, దళారులు, పైరవీకారుల రాజ్యం. అందుకే చెప్తున్న.. రైతులు అందరూ ఆలోచించి దుర్మార్గపు కాంగ్రెస్ పార్టీని మట్టికరిపించాలి. బీజేపీ మతపిచ్చితోని మంటలు పెట్టి ప్రజలను విడగొట్టే పనులు చేస్తున్నది. మెడికల్ కాలేజీ ఇవ్వలే, నవోదయ స్కూల్ ఇవ్వలే.. ఆ పార్టీ నేతలు ఓట్లకోసం వస్తే.. నిలదీసి అడగండి. రెండు జాతీయ పార్టీలు తెలంగాణను ముంచినవే. గంపగుత్తగా బీఆర్ఎస్ పార్టీకి ఓటువేసి అభివృద్ధిని కొనసాగించుకోవాలి. అని సీఎం కేసీఆర్ అన్నారు.



నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు భారీగా హాజరైన జనం, సభా వేదికపై ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, చిత్రంలో అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తా





ఎల్లారెడ్డి ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం

# 3 గంటలతో.. మొదటి మడి తడుస్తదా..?

దొంగ కాంగ్రెస్‌కు ఓటేసి.. రైతులు నష్టపోవద్దు

బీఆర్ఎస్ చరిత్ర.. మీ కండ్లముందే ఉన్నది

ప్రజాస్వామ్య ప్రక్రియలో పరిణతి వచ్చినప్పడే దేశం అభివృద్ధి చెందుతుంది. స్వతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు అవుతున్నా మన దేశంలో పరిణతి రాలేదని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం అభ్యర్థి జాజుల సురేందర్, మెదక్ నియోజకవర్గం అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డికి మద్దతుగా నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గులాబీ జెండా పుట్టింది మీ కనుసన్నల్లోనే.. బీఆర్ఎస్ చరిత్ర మీ కండ్లముందే ఉన్నది. రైతు బాగుంటేనే.. దేశం బాగుంటుందనే ఉద్దేశంతో మిషన్ కాకతీయ తీసుకువచ్చి చెరువులు నింపినం. 24 గంటల కరెంటు ఇస్తున్నం. మంచినీళ్ల బాధలు తీర్చినం.. పంటలు, పరిశ్రమలు పెరిగాయి.. పెట్టుబడులు వస్తున్నయ్.. ఐటీ రంగం విస్తరించింది.. రాష్ట్రం తలసరి ఆదాయంలో నం.1 స్థానంలో నిలిచింది. ధరణి, రైతుబంధు, 24 గంటల కరెంటుతో రైతుల ముఖం తెల్లవడుతున్నది. నాడు చప్రాసీ నౌకరి ఉన్నోడికి పిల్లను ఇచ్చారు.. ఇవాళ భూమి ఉన్నోడికే పిల్లను ఇస్తమంటున్నరు. ఇవన్నీ మరో ఐదు, పదేండ్లు అమలవుతే.. రైతులు కుదుటపడుతరు. తెలంగాణ ప్రజలు క్షేమంగా ఉండాలంటే పార్టీల నడవడిక, చరిత్ర గురించి ఆలోచించాలి. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే రైతులు నష్టపోతరు. మీ ఓటుతోనే.. మీ వేలితోనే మీ కన్ను పొడిపించాలని కాంగ్రెస్ చూస్తున్నది. ఆ పార్టీ నాయకులు అనాలోచితంగా, అవగాహన లేకుండా మాట్లాడుతున్నరు. ధరణి ఎత్తేస్తాం.. 3 గంటల కరెంటు ఇస్తాం, ఇదే మా పాలసీ అని చెబుతున్నరు. మూడు గంటల కరెంటుతో మొదటి మడి తడుస్తదా..? ఇదే దొంగ కాంగ్రెస్‌ను నమ్మి, కర్ణాటక రైతులు ఓటేసి ఇప్పుడు గొడగొడ ఏడుస్తుండ్రు. ఇక్కడ మీరు కూడా మోసపోతే.. మళ్లీ గోసపడుతాం. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. రానున్న రెండేండ్లలో ఒక ఎకరం కూడా మిగలకుండా పారించే బాధ్యత నాది. అని సీఎం కేసీఆర్ అన్నారు.



ఎల్లారెడ్డి సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, చిత్రంలో అభ్యర్థి జాజుల సురేందర్

"కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. 24 గంటల కరెంటు బంద్ చేసి.. 3 గంటల కరెంటు ఇస్తాం. 10 హెచ్‌పీ మోటర్లుపెట్టుకోవాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అంటుండు. రైతుల వద్ద 10 హెచ్‌పీ మోటర్ ఉంటదా..? ఒకటి కాదు.. రెండు కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల పంపుసెట్లు ఉన్నవి. ఇవన్నీ కొనాలంటే రూ.30వేల కోట్లు కావాలి. అంతడబ్బు ఎవడు ఇవ్వాలి.."



మెదక్ సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, చిత్రంలో అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డి

- కర్నాటక రైతులు గొడగొడ ఏడుస్తుండ్రు
- మరో ఐదు, పదేండ్లు మన పథకాలు అమలు కావాలి
- రానున్న రెండేండ్లలో ప్రతి ఎకరా.. పారించే బాధ్యత నాది
- భూమి ఉన్న రైతులంతా.. కోటీశ్వరులయ్యారు..
- వాళ్లు చెప్పే మోటర్లు కొనాలంటే.. రూ.30వేల కోట్లు కావాలి
- అంతడబ్బు ఎవడు ఇవ్వాలి
- ఎల్లారెడ్డి, మెదక్ ప్రజాఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి కేసీఆర్



మెదక్ సభకు హాజరైన జనం